## క్లుప్తంగా

### లోటుపాట్లు రానివ్వొద్దు

**మణుగూరుటౌన్:** సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియాలోని భద్రాద్రి స్టేడియంలో నిర్వహించే సింగరేణి దినోత్సవ వేడుకల్లో ఎటువంటి లోటుపాట్లు లేకుండా చర్యలు తీసుకోవాలని ఏరియా జీఎం దుర్గం రాంచందర్ అన్నారు. గురువారం ఏర్పాట్లను పరిశీలించి ఆయా విభాగాల అధికారులతో ఆయన మాట్లాడారు. డిసెంబర్ 23న జరిగే వేడుకలకు కుర్చీలు, తాగునీరు, ప్రధాన వేదిక లైటింగ్ తదితర ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని అధికారులను ఆదేశించారు. కార్మిక కుటుంబాలను ఆకట్టుకునేవిధంగా అందరినీ అలరించే విధంగా కళాత్మక, సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశామన్నారు. కార్యక్రమంలో అధికారులు వీసం కృష్ణయ్య, వెంకటేశ్వర్లు, నర్సిరెడ్డి, సలగల రమేశ్, మధుసూదన్‌రాజు, శోభన్‌బాబు, సింగు శ్రీనివాస్, రామేశ్వరరావు, ప్రవీణ్‌కుమార్, జాన్‌వెస్లీ పాల్గొన్నారు.

### గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు

**బూర్గంపాడు:** సారపాకలోని సీఎస్‌ఐ ప్రార్థన మందిరంలో షిలోహు మినిస్ట్రీస్ ఆధ్వర్యంలో గురువారం గ్రాండ్ క్రిస్మస్ వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. షిలోహు మినిస్ట్రీస్ వ్యవస్థాపకులు పాస్టర్ మోజెస్ ములక ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ వేడుకలలో బూర్గంపాడు, భద్రాచలం, కుక్కునూరు, వేలేరుపాడు, మారేడుమిల్లి, ఎటపాక,వీఆర్ పురం, కూనవరం, రంపచోడవరం మండలాలకు చెందిన 200మంది పాస్టర్లకు రూ.3లక్షల విలువైన క్రిస్మస్ కానుకలను అందించారు. ఈ సందర్భంగా పాస్టర్ మోజెస్ మాట్లాడుతూ.. క్రీస్తు చూపిన ప్రేమ, అప్యాయతలను ప్రజలందరికి పంచాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంఘ కాపరి పాస్టర్ పెద్దారావు,సైమన్, జాషువా,స్టీవ్ ఏలియట్, రాజీవ్ రత్నాకర్, షాలేమ్ రాజ్,జాన్‌బాబు, యాకుబ్,టీ మహిమకుమార్ తదితరులు పాల్గొన్నారు.

### నూతన కమిటీ ఎన్నిక

**భద్రాచలంటౌన్:** భద్రాచలం మండల టీఎస్‌యూటీఎఫ్ నూతన కమిటీని గురువారం పట్టణంలో జరిగిన టీఎస్‌యూటీఎఫ్ 10వ మండల మహాసభలో ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు కిషోర్ సింగ్, కృష్ణల సమక్షంలో జరిగిన ఈ ఎన్నికలో మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా విజయ్‌కుమార్, ఉపాధ్యక్షులుగా రమేష్‌చంద్, ఆశాలత, కోశాధికారిగా వెంకటేకటేశ్వర్లు, కార్యదర్శులుగా శ్రీనివాసరావు, రమేష్, పూర్ణ, పుష్పలత, రమణామూర్తి, తహరలతో పాటు కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

### రోడ్డుకు మరమ్మతులు

**చంద్రుగొండ:** మండలంలోని తిప్పనపల్లి గ్రామంలో ఎస్సీకాలనీ రోడ్డుకు ఎంపీటీసీ లంకా విజయలక్ష్మి సొంత డబ్బులతో గురువారం మరమ్మతులు చేయించారు. గుంటలమయంగా మారిన రోడ్డుతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. ఈ క్రమంలో ఎంపీటీసీ స్పందించి స్వంత డబ్బులు వెచ్చించి గ్రావెల్ తోలించారు.

### అమలు చేయించాలి

**మణుగూరురూరల్:** సింగరేణి సంస్థలో వివిధ విభాగాల్లో పని చేస్తున్న ఈపీ ఆపరేటర్ల సూటబుల్ జాబ్ ఒప్పందాన్ని అమలు చేయించాలని కోరుతూ మణుగూరు ఏరియా ఈపీ ఆపరేటర్లు కోరారు. గురువారం సింగరేణి గుర్తింపు సంఘ ఎన్నికల్లో భాగంగా ఏరియాలోని ఓసీ-2లో ప్రచారానికి వచ్చిన సీఐటీయూ రాష్ట్ర నాయకుడు రాజారావుకు ఆపరేటర్లు సంతకాలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. అనంతరం ఆపరేటర్లు మాట్లాడుతూ.. రెండేళ్లు పూర్తైన సూటబుల్ జాబ్ ఒప్పందాన్ని అమలు చేయకపోవడం వల్ల ఎంతోమంది కార్మికులు నష్టపోతున్నారన్నారు. కార్మిక సంఘాలన్ని స్పందించాలన్నారు. కార్యక్రమంలో ఈపీ ఆపరేటర్లు ఎస్డీ.నాసర్‌పాషా, గట్టయ్య, ఈశ్వర్, జానకిప్రసాద్, కుమారస్వామి, రాజలింగు, అంయ్య, అహ్మద్, సుదర్శన్, బుచ్చిరెడ్డి, కృష్ణంరాజు, రాములు, శ్రీనివాస్, రాజేంద్రప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### సీఎం, మంత్రికి కృతజ్ఞతలు

**అశ్వాపురం:** మినీ అంగన్‌వాడీలను ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలుగా మారుస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం పట్ల సీఎం రేవంత్‌రెడ్డికి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కకు ఏఐటీయూసీ పక్షాన కృతజ్ఞతలు తెలుపుతున్నామని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి వేల్పుల మల్లికార్జున్, అంగన్‌వాడీ టీచర్లు, హెల్పర్స్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి రెడ్డి అరుణ అన్నారు. అశ్వాపురంలో గురువారం వారు విలేకరులతో మాట్లాడారు.ఏఐటీయూసీ పోరాట ఫలితంగా రాష్ట్ర వ్యాప్తంగా 3,989 మినీ అంగన్‌వాడీలు ప్రధాన కేంద్రాలు మార్చారన్నారు. మినీ అంగన్‌వాడీ టీచర్లుగా ఉన్న వారికి ఇకపై రూ.13,500 వేతనం వస్తుందన్నారు. హెల్పర్లను నియమిస్తారన్నారు.

### పనులు చేపట్టాలి

**మణుగూరురూరల్:** మండలంలోని సమితిసింగారం గ్రామపంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని బీజేపీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం బీజేపీ నాయకులు లింగంపల్లి రమేష్, కట్టా నారాయణమూర్తిలు సమితిసింగారం పంచాయితీలోని వివేకానంద నగర్ ప్రాంతాన్ని సందర్శించి నెలకొన్న సమస్యలను అక్కడి ప్రజలను అడిగి తెలుసుకున్నారు. వారు సమస్యను స్థానిక సర్పంచ్ బచ్చల భారతి దృష్టికి తీసుకెళ్లగా.. వెంటనే ఆమె స్పందించి పారిశుద్ధ్య పనులు నిర్వహిస్తామని తెలిపినట్లు వెల్లడించారు.

# పంజా విసురుతున్న చలి

- రోజు రోజుకూ పడిపోతున్న ఉష్ణోగ్రతలు
- ఏజెన్సీలో రైతులు, విద్యార్థుల అవస్థలు
- ఉదయం 10 కానిదే తెరుచుకోని షాపులు
- బెంబేలెత్తుతున్న వాహనదారులు



చలి తీవ్రతతో చర్లలో ఉదయం 10 గంటలకూ తెరుచుకోని షాపులు



వణుకుతూనే స్కూల్‌కు వెళ్తున్న విద్యార్థులు

**చర్ల/చర్లరూరల్:** ఏజెన్సీ ప్రాంతంపై చలి పంజా విసురుతోంది. ఇటీవల బంగాళాఖాతంలో ఏర్పడిన మిచాంగ్ తుపాన్ ప్రభావంతో వర్షాలు కురవగా.. నాటి నుంచి క్రమంగా ఉష్ణోగ్రతలు పడిపోవడం మొదలయ్యాయి. ముఖ్యంగా రాత్రివేళల్లో చలి ముంచుకొస్తోంది. మధ్యాహ్నం కాస్తా ఎండ వస్తున్నప్పటికీ ఉష్ణోగ్రతలు అంతంత మాత్రంగానే ఉంటున్నాయి. ఏజెన్సీ ప్రాంతంలో సరిహద్దుగా అడువులు, నీటి వనరులు ఉండడంతో మైదాన ప్రాంతాల కన్నా ఎక్కువగా చలి ఆవరిస్తోంది. ఇక్కడ గత వారం రోజులుగా 16 నుంచి 17 డిగ్రీల సెల్సియస్‌గా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. దీంతో ఏజెన్సీ ప్రజలు వణుకుతున్నారు.

**పనులకు ఆటంకం..**

ఉదయం 10 గంటల వరకు చలి తీవ్రత తగ్గక పోవడంతో జనం ఇళ్లల్లోంచి బయటకు రాలేకపోతున్నారు. పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులు గజగజ వణుకుతూనే వెళ్లాల్సి వస్తోంది. ఈ నేపథ్యంలో కొన్ని చోట్ల తమ పిల్లలను తల్లిదండ్రులు పాఠశాలలకు పంపించడం మానేస్తున్నారు. కిరాణా షాపులు తప్ప మిగిలిన షాపులేవీ ఉదయం 10 గంటల లోపు తెరవడం లేదు. అదే విధంగా సాయంత్రం 5 గంటల నుంచే చలి తీవ్రత పెరుగుతుండడంతో అత్యవసర పనుల కోసం బయటకు వెళ్తున్నారు. అప్పటికే బయటకు వెళ్లినవారు ఆలోగా పనులు ముగించుకొని ఇళ్లకు చేరుకుంటున్నారు. తీవ్రంగా వణికిస్తున్న చలి వ్యవసాయ పనులకు వెళ్తున్న కూలీలు, రైతులను తీవ్రంగా కలవరపెడుతోంది. ద్విచక్రవాహనాలు, ఆటోలు నడిపే వారు చలి తీవ్రతకు బెంబేలెత్తుతున్నారు.

**ప్రత్యామ్నాయాలకు పరుగులు**

చలిని తట్టుకునేందుకు ఏజెన్సీవాసులు అందుబాటులో ఉన్న ప్రత్యామ్నాయాలను వెతుకుతున్నారు. అందులో భాగంగా చలి తీవ్రతను తట్టుకునేందుకు 10 గంటల వరకు చలి మంటల వద్దే ఉంటున్నారు. స్వెటర్లు, నగిడీలు వంటి వస్త్రాలతో నెట్టుకొస్తున్నారు. ఇప్పటికే 16 డిగ్రీల సెల్సియస్‌కు ఉష్ణోగ్రతలు పడిపోగా.. మరో రెండు మూడు రోజుల్లో మరింతగా తగ్గే అవకాశం ఉంది. దాంతో చలి తీవ్రత మరింతగా పెరిగి జనం అల్లాడే పరిస్థితులు కనిపిస్తున్నాయి.



చలి నుంచి ఉపశమనానికి చలిమంట కాగుతున్న గిరిజన వాసులు

### పనులు మానుకుంటున్నాం..



గడిచిన 10 రోజుల నుంచి చలి అల్లాడిస్తోంది. ఉదయం 10 గంటలు దాటినప్పటికీ చలి తగ్గకపోతుండడంతో అత్యవసర పనులు కూడా మానుకోవాల్సి వస్తోంది. తుపాను వచ్చి పోయిన దగ్గర నుంచి చలి తీవ్రంగా ఉంటోంది.

– కోడిరెక్కల సాయికుమార్, తేగడ

### స్కూల్‌కు వెళ్లలేకపోతున్నారు..



చలి తీవ్రత వల్ల పిల్లలు స్కూళ్లకు కూడా వెళ్లలేకపోతున్నారు. రోజు వారికి సర్ది చెప్పి పంపించాల్సి వస్తోంది. చలి తీవ్రతకు వేరే మార్గం కనిపించకపోవడంతో ఒక్కోరోజు మేమే స్కూలు మానిపిస్తున్నాం.

– ఎం.ఆనంద్‌కుమార్, తేగడ

### వ్యవసాయ పనులకు ఇబ్బంది



చలి తీవ్రత వల్ల ఉదయం పూట వ్యవసాయ పనులకు వెళ్లడం కష్టమవుతోంది. చేయాల్సిన వ్యవసాయ పనులు ముమ్మరంగా ఉన్నప్పటికీ తీవ్రంగా ఉన్న చలి వ్యవసాయ పనులను ముందుకు సాగనివ్వడం లేదు.

– సిద్ది కోటేశ్వరరావు, కుదునూరు

# మంత్రి పొంగులేటిని కలిసిన పొదెం



భద్రాచలంటౌన్: మంత్రి పొంగులేటికి పూల మొక్క అందజేస్తున్న పొదెం వీరయ్య

**భద్రాచలంటౌన్:** తెలంగాణ రాష్ట్ర రెవెన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డిని భద్రాచలం మాజీ ఎమ్మెల్యే, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు పొదెం వీరయ్య సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పొదెం వీరయ్య, మంత్రి పొంగులేటిని శాలువతో సత్కరించి పూల మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా, డివిజన్ నాయకులు పాల్గొన్నారు.

**మంత్రులను కలిసిన మండల వాసులు**

**దమ్మపేట:** రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిలను దమ్మపేట మండల వాసులు మర్యాదపూర్వకంగా కలిసి, అభినందనలు తెలిపారు. గురువారం దమ్మపేట మండలం నాచారం గ్రామానికి చెందిన ఏఎస్పీ స్థాయి పోలీస్ అధికారి నరుకుళ్ల త్రినాథ్, హైదారాబాద్‌లోని తెలంగాణ సచివాలయంలోని మంత్రి చాంబర్‌లో ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం మంత్రి పొంగులేటిని, మర్యాదపూర్వకంగా కలశారు. పుష్పగుచ్ఛం అందజేసి, అభినందనలు తెలిపారు. అదే గ్రామానికి చెందిన కాంగ్రెస్ నాయకుడు యర్రగొర్ల రాధకృష్ణ మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిని మర్యాదపూర్వకంగా కలసి, అభినందనలు తెలిపారు.

**చంద్రుగొండ:** రెవెన్యూశాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టిన పాలేరు ఎమ్మెల్యే పొంగులేటి శ్రీనివాసరెడ్డిని గురువారం హైదరాబాద్‌లో మండల కాంగ్రెస్ నాయకులు కలిశారు. పొంగులేటికి వారు పుష్పగుచ్ఛాలతో శుభాకాంక్షలు తెలిపారు. పొంగులేటితోపాటు వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, ఎమ్మెల్యే జారే ఆదినారాయణను కలిసినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు భోజ్యానాయక్, సారేపల్లి శేఖర్ తదితరులున్నారు.

# గ్రామాల్లో వైద్య శిబిరాలు

**చర్లరూరల్:** చర్ల మండలం మొగళ్లపల్లి గ్రామంలో గురువారం వైద్య శిబిరం నిర్వహించారు. డాక్టర్ పూజ పలువురికి పరీక్షలు నిర్వహించి, కావలసిన మందులు పంపిణీ చేశారు. షుగర్, బీపీ వ్యాధిగ్రస్తులను గుర్తించి మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్‌ఈఓ వేణుగోపాల్, హెల్త్ సూపర్ వైజర్ రాంప్రసాద్, ఏఎన్‌ఎం స్వరాజ్యలక్ష్మి, ఆశాకార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. మరోవైపు, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామమైన చెన్నాపురంలో గురువారం చర్ల మండలం సత్యనారాయణపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. సుమారు 50 మందికి డాక్టర్ దివ్యనయన వైద్య చికిత్సలు అందించారు. వీరిలో ఆరుగురికి జ్వరాలు ఉండగా.. మిగతా వారికి సాధారణ చికిత్సలు చేసినట్లు వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో డీపీఎంఓ సత్యనారాయణ, హెచ్‌ఈఓ బాబూరావు, వేణు, వరప్రసాద్, రాజేశ్వరి, కవిత, దేవి తదితరులు పాల్గొన్నారు.



చంద్రుగొండ: వైద్యశిబిరం నిర్వహిస్తున్న సిబ్బంది

**చంద్రుగొండ:** మండలంలోని వంకనెంబర్ గ్రామంలో గురువారం వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వైద్యులు డాక్టర్ వెంకటప్రకాష్ రోగులను పరీక్షించి మందులు పంపిణీ చేశారు. పరిసరాల పరిశుభ్రత, ఆహారంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలను గ్రామస్తులకు వివరించారు. ఈ శిబిరంలో వైద్యసిబ్బంది యండి.ఇమాం, రమ్య, సునిత, రామాదేవి, సరోజిని, నాగరత్నం పాల్గొన్నారు.

# టీబీజీకేఎస్‌ను గెలిపించండి



మాట్లాడుతున్న టీబీజీకేఎస్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రావు

**మణుగూరుటౌన్:** మాజీ సీఎం కేసీఆర్ న్యాయ నిపుణులను సంప్రదించి కారుణ్య నియామకాలను సాధించిందని టీబీజీకేఎస్‌ను గెలిపించాలని ఆ సంఘం బ్రాంచ్ ఉపాధ్యక్షుడు వి.ప్రభాకర్‌రావు కోరారు. గురువారం కేసీహెచ్‌పీ వద్ద జరిగిన గేట్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. టీబీజీకేఎస్ నేతృత్వంలో 125 పైగా మెడికల్ బోర్డులు నిర్వహించి ఏరియాలో 400కు పైగా కారుణ్య నియామకాలు అందించామన్నారు. 44 మందికి పైగా ఉద్యోగాలకు బదులుగా రూ.25లక్షలు అందించామన్నారు. కోల్ ఇండియాలో లేని ఈవిధానం టీబీజీకేఎస్ కృషి ఫలితంగానే సాధ్యమైందన్నారు. మణుగూరు ఏరియాలో కోట్ల విలువైన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించడం జరిగిందన్నారు. ఎక్స్‌టర్నల్ ద్వారా నాలుగువేల మందికి పోస్టింగ్ ఇప్పించిన ఘనత టీబీజీకేఎస్‌దేనన్నారు. ఇంక్రిమెంట్, కార్మిక పిల్లల ఉన్నత విద్య తదితరాలకు ఫీజ్ రీయింబర్స్‌మెంట్, సంక్రాంతి, క్రిస్మస్ రంజాన్ పండగలకు ఆప్షనల్ హాలిడే తదితర 9 సంవత్సరాల కాలంలో 64కు పైగా డిమాండ్స్ సాధించి చరిత్ర సృష్టించామన్నారు. అలాంటి టీబీజీకేఎస్‌ను ప్రతీ కార్మికుడు 10వ నంబర్ బాణం గుర్తుపై ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు రవూఫ్, వీరభద్రయ్య, వెంకటేశ్వర్‌రెడ్డి, కాపా శివాజీ, డీవీ, రాజబాబు, రాజన్, బాలాజీ, రామారావు, ప్రవీణ్, పీక శంకర్, అజిత్, ముత్యం, ఆదిశంకర్ పాల్గొన్నారు.

### దుస్తుల వితరణ

**దుమ్ముగూడెం:** మండల కేంద్రంలోని ఏకలవ్య గురుకుల పాఠశాల విద్యార్థులకు గురువారం దుస్తులు పంపిణీ చేశారు. పాఠశాలలోని హిందీ ఉపాధ్యాయుడు నాగేశ్వరరావు మిత్రుడు సత్తుపల్లికి చెందిన అడ్వకేట్ టి.బ్రహ్మాజీ ఏకలవ్య విద్యార్థులకు దుస్తులు అందించాలని కోరగా ఆయన జన్మదినాన్ని పురస్కరించుకుని దుస్తులను సమకూర్చారు. పాఠశాలలోని తల్లి లేదా తండ్రి లేని 25 మందిని గుర్తించి ప్రిన్సిపాల్ కె.వీరాస్వామి అధ్యక్షతన జరిగిన సమావేశంలో దాత బ్రహ్మాజీ చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఆర్థిక సాయం..

**మణుగూరురూరల్:** పట్టణంలోని మణుగూరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చదువుతున్న పేద విద్యార్థినులకు లయన్స్ క్లబ్ ఆఫ్ మణుగూరు ఆర్థిక చేయూతను అందించింది. లయన్స్ క్లబ్ సభ్యులు చింతపల్లి రాంబాబు ఆర్థిక సహకారంతో లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో డిగ్రీ కళాశాలకు చెందిన నలుగురు విద్యార్థినులకు రూ.10వేలతో పరీక్షా ఫీజును నగదు రూపంలో కళాశాల ప్రిన్సిపల్ బి.శ్రీనివాస్‌కు క్లబ్ అధ్యక్షులు గాజుల పూర్ణచందర్‌రావు గురువారం అందజేశారు. కార్యక్రమంలో లయన్స్ క్లబ్ కార్యదర్శి మీరాహుస్సేన్, పీఆర్‌సి గాజుల రమేష్‌కుమార్, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**అశ్వాపురం:** మండల పరిధిలోని తురుముల గూడెం తండా గ్రామానికి చెందిన బొల్లోజు వేణు గుండెకు రంధ్రం పడగా.. హైదరాబాద్ ఆస్పత్రికి వెళ్లడానికి దారి ఖర్చులకు గురువారం మానవసేవే మాధవసేవ ట్రస్ట్ సభ్యులు రూ.4వేలు వితరణగా అందజేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు గాదె కేశవరెడ్డి, సజ్జా శ్రీనివాసరావు, సజ్జా సాహిత్య, పిట్టా శ్రీను, అమిరుద్దిన్, శంకరయ్య చారి పాల్గొన్నారు.

### టోర్నీకి ఏర్పాట్లు

**భద్రాచలంటౌన్:** భద్రాచలం పట్టణంలోని జూనియర్ కళాశాల క్రీడా మైదానంలో ఈ నెల 26 నుంచి జనవరి 7 వరకు నిర్వహించే 28వ నెహ్రూ కప్ అంతరాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలకు ఏర్పాట్లను గురువారం నిర్వాహకులు ప్రారంభించారు. ఈ సందర్భంగా క్రికెట్ పిచ్ నిర్మాణానికి శంకుస్థాపన చేసి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో తోటమళ్ల బాలయోగి, అట్లూరి శ్రీధర్‌చ మడిపల్లి నాగార్జున, శ్రీనివాస్, సదానందం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

### సమావేశానికి తరలిరండి

**దమ్మపేట:** కొత్తగూడెంలోని బీఆర్‌ఎస్ పార్టీ ప్రగతి భవన్‌లో రేపు(శనివారం) నిర్వహించనున్న జిల్లా స్థాయి సమీక్ష సమావేశానికి గులాబీ సైన్యం వందలాదిగా తరలి రావాలని దమ్మపేట మండల బీఆర్‌ఎస్ పార్టీ ప్రధాన కార్యదర్శి దొడ్డా రమేష్ గురువారం ఓ ప్రకటనలో కోరారు. బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు రేగా కాంతారావు అధ్యక్షతన కొత్తగూడెంలో సమీక్ష సమావేశం, శనివారం ఉదయం 10 గంటలకు నిర్వహించనున్నట్లు తెలిపారు. బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రతి ఒక్కరు తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని కోరారు.

# కొనుగోళ్లలో ఆలస్యం.. అలసత్వం

**అశ్వాపురం:** మండల పరిధిలోని నెల్లిపాక గ్రామంలోని శ్రీ రామ కాటన్ ఇండస్ట్రీస్ జిన్నింగు మిల్లులోసీసీఐ కేంద్రం ఏర్పాటు చేయగా.. ఇక్కడ పత్తి కొనుగోళ్లు ఆలస్యమవుతున్నాయి. రోజుల తరబడి కొనుగోలు చేయకపోవడంతో మొండికుంట–సారపాక రహదారిపై పత్తి వాహనాలు నిలుపాల్సి వస్తోంది. దాదాపు ఐదు రోజుల వరకు వేచి చూడాల్సి రావడంతో పదుల సంఖ్యలో పత్తి వాహనాలు రోడ్డుపై నిలిపి ఉంచారు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. వాహనాల కిరాయిలు సైతం అధికమవుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కొనే పత్తిలో కూడా నాలుగు, ఐదు కేజీలు కోత విధిస్తున్నారని రైతులు ఆవేదన చెందుతున్నారు. మరోవైపు, జిన్నింగు మిల్లు వద్ద పత్తి వాహనాలు నిలుపుతుండడం, అదే స్థలంలో మూలమలుపు ఉండడంతో మొండికుంట–సారపాక రహదారిపై ప్రమాదకర వాతావరణం నెలకొంది. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందో అని వాహనదారులు, స్థానికులు భయాందోళన చెందుతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సీసీఐ కేంద్రంలో పత్తి కొనుగోలు వేగవంతం అయ్యేలా చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. పత్తి వాహనాలు రహదారి వెంబడి నిలపకుండా ప్రమాదాలు జరగకుండా జిన్నింగు మిల్లు యాజమాన్యం తగు చర్యలు తీసుకునేలా అధికారులు చూడాలని స్థానికులు కోరుతున్నారు.



జిన్నింగ్ మిల్లు వద్ద రహదారిపై నిలిచిపోయిన పత్తి వాహనాలు

# అధికంగా ఆశీల వసూళ్లు

**భద్రాచలంఅర్బన్:** వాహనాలకు పార్కింగ్‌కు సంబంధించి భద్రాచలం పంచాయతీ ఆధ్వర్యంలో ఆశీలు అధిక మొత్తంలో వసూలు చేస్తున్నారని మరోమారు తేటతెల్లమైంది. ఇందుకు సంబంధించి గురువారం ఖమ్మం జిల్లా మధిర గ్రామానికి చెందిన నాగసాయి అనే భక్తుడు కుటుంబ సభ్యులతో కలిసి తన కారులో భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామిని దర్శించుకునేందుకు వచ్చాడు. తన కారు పార్కింగ్‌కు రూ.150 ఆశీలు కట్టాల్సిందిగా పంచాయతీ సిబ్బంది టికెట్టు ఇచ్చారు. వాస్తవానికి ఇక్కడ కారుకు రూ.50 మాత్రమే వసూలు చేయాల్సి ఉంటుంది. దీంతో గత ఏడాది తాను భద్రాచలం వచ్చినప్పుడు రూ.50లు మాత్రమే వసూలు చేశారని, ఇప్పుడు అమాంతం రూ.100లు పెరిగిందని సదరు నాగసాయి నిలదీశారు. కడితే కట్టు లేకుంటే లేదు అంటూ సదరు పంచాయతీ సిబ్బంది దురుసుగా ప్రవర్తించినట్లు అతను గ్రామపంచాయతీ కార్యాలయంలో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఇదే విషయంపై సాక్షి గ్రామ పంచాయతీ అధికారి శ్రీనివాస్‌ను వివరణ కోరగా.. భక్తుడి నుంచి తనకు ఫిర్యాదు అందిందని, ఈ ఘటనపై పూర్తి స్థాయి విచారణ చేపట్టి గ్రామ పంచాయతీ సిబ్బంది తరఫున ఏదైనా తప్పు జరిగి ఉంటే చర్యలు తీసుకుంటానని ఆయన తెలిపారు.

# కూర్మావతారంలో పర్ణశాల రామయ్య



కూర్మావతారంలో రామయ్య..

**దుమ్ముగూడెం:** వైకుంఠ ఏకాదశి అధ్యయనోత్సవాల్లో భాగంగా రెండో రోజు పర్ణశాల రామయ్యను ఆలయ అర్చకులు కూర్మావతారంలో గురువారం అలంకరించారు. ముందుగా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అర్చకులు.. అనంతరం స్వామి వారిని కూర్మావతారంలో అలంకరించారు. ఈ అవతారాన్ని దర్శించడం వల్ల శనిగ్రహ సంబంధమైన దోషాలు తొలగుతాయని అర్చకులు వివరించారు. సాయంత్రం సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా ఏలూరుకు చెందిన సప్పా భారతి భాగవతారిణి ఆధ్వర్యంలో నర్తనశాల హరికథ కాలక్షేపం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు అమరవాది కిషోర్ కుమారాచార్యులు, శేషం కిరణ్‌కుమారాచార్యులు, భరద్వాజచార్యులు, నరసింహాచార్యులు, ఏఈఓ శ్రావణ్‌కుమార్, అనిల్‌కుమార్, సూపరింటెండెంట్ కిషోర్, ఆలయ ఇన్‌చార్జ్ ప్రసాద్, సిబ్బంది శివ, రాము తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా 'ఇరుముడి' కార్యక్రమం

**ములకలపల్లి:** ములకలపల్లిలో అయ్యప్ప మాలాధారుల ఇరుముడి కార్యక్రమాన్ని ములకలపల్లిలో గురువారం ఘనంగా నిర్వహించారు. స్థానిక ఉమా పృథ్వీ రామలింగేశ్వర స్వామి ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గురుస్వామి కృష్ణారావు స్వామి ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ప్రత్యేక పూజల అనంతరం మాలాధారులు శబరిమల యాత్రకు పయనమయ్యారు. మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు. ములకలపల్లి ఉపసర్పంచ్ శనగపాటి అంజి, మాజీ జెడ్పీటీసీ బత్తుల అంజి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తాండ్ర ప్రభాకర్‌రావు, గాడి తిరుపతిరెడ్డి, శనగపాటి రవి, పువ్వాల శ్రీనివాస్, సాయి, గుంట్రు కృష్ణ, ఆదిత్య, హరి, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

**పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే..**

**దమ్మపేట:** మండల కేంద్రంలో నిర్వహించిన అయ్యప్పల ఇరుముడి పూజా కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ ఎమ్మెల్యే మెచ్చా నాగేశ్వరరావు గురువారం పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు దారా మల్లిఖార్జునరావు, దారా యుగంధర్, యార్లగడ్డ శ్రీను, పానుగంటి చిట్టిబాబు, ఉయ్యాల లక్ష్మీనారాయణ, లోకేష్, రూపా రాంబాబు తదితరులు పాల్గొన్నారు.



ములకలపల్లి: శబరిమల యాత్రకు బయలుదేరుతున్న మాలధారులు

### బీజేపీ ఆందోళన

**బూర్గంపాడు:** జార్ఖండ్‌కు చెందిన కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహు ఇంట్లో జరిగిన ఐటీ దాడుల్లో రూ.353 కోట్ల నల్లధనం దొరికిన నేపథ్యంలో అతనిని ఎంపీ పదవి నుంచి తొలగించాలని బీజేపీ ఆధ్వర్యంలో సారపాకలో గురువారం ఆందోళన చేపట్టారు. సారపాక ప్రధాన కూడలిలో ప్లకార్డులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి ఏనుగుల వెంకటరెడ్డి మాట్లాడుతూ.. అవినీతికి పాల్పడిన కాంగ్రెస్ ఎంపీ ధీరజ్ సాహు పార్లమెంట్ సభ్యత్వాన్ని రద్దు చేయాలని, అతనిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు బిజ్జం శ్రీనివాసరెడ్డి, కేసగాని శ్రీనివాస్‌గౌడ్, దుప్పటి సురేష్, కైపు వెంకట్రావిఎరెడ్డి, బిజ్జం అశోక్‌రెడ్డి, యిమడాబత్తుని వెంకటేశ్వరరావు, వెలిశెట్టి రామారావు,కారం సాయికిరణ్, కొడెబోయిన రవి, వెలిశెట్టి పిచ్చయ్యనాయుడు, కంది వెంకటరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఆటో వర్కర్ల ధర్నా

**చర్ల:** తెలంగాణా రాష్ట్రం నూతనంగా ప్రవేశపెట్టిన ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణం వల్ల తమ బతుకులు అగమ్యగోచరంగా తయారయ్యాయని తమను ప్రభుత్వం ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం చర్లలో ఆటో కార్మికులు ధర్నా నిర్వహించారు. చర్లలోని బస్టాండ్ సెంటర్‌లో ధర్నా నిర్వహించిన ఆటో కార్మికులు.. మహిళలకు ఉచిత ప్రయాణం వల్ల గడిచిన ఆరు రోజులుగా ప్యాసింజర్లు ఎక్కక ఖాళీగా ఉంటున్నామన్నారు. దినసరిగా వచ్చే డబ్బులతోనే తమ కుటుంబాలను వెళ్లదీసుకోవడంతో పాటు ఫైనాన్స్ పద్ధతిలో తీసుకున్న ఆటోలకు నెలవారీ వాయిదాలు చెల్లిస్తున్నామని, ఈ పరిస్థితుల్లో కాలం గడుపుతున్న తమపై ఆర్టీసీ ఉచిత ప్రయాణం పెనుభారం మోపిందన్నారు. తమ సమస్యను పరిష్కరించాలని ఆటో కార్మికులు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో, మ్యాజిక్‌లకు చెందిన పలువురు డ్రైవర్లు, ఓనర్లు పాల్గొన్నారు.

# కార్మికుల పక్షాన ఏఐటీయూసీ పోరాటం



మాట్లాడుతున్న ఏఐటీయూసీ బ్రాంచ్ నేత రాంగోపాల్

**మణుగూరుటౌన్:** కార్మికుల పక్షాన పోరాటం చేసి ఎన్నో పోరాటాలు చేసి హక్కులు సాధించి పెట్టిన ఘనత ఏఐటీయూసీదేనని ఆ సంఘం బ్రాంచి సెక్రటరీ వై.రాంగోపాల్ అన్నారు. గురువారం కేపీయూజీ మైన్ నందు జరిగిన ఫిట్ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సింగరేణిలో కాంట్రాక్టీకరణను పెంచి తెలంగాణ వచ్చిన తర్వాత కొత్తగా ఒక్క బొగ్గుబావిని కూడా ప్రారంభించలేదన్నారు. ప్రతీ ఏరియాలో అండర్‌గ్రౌండ్ తప్పనిసరిగా ఉండాలని తమ యూనియన్ ముందు చూపుతో ఉన్నతాధికారులతో మాట్లాడి పంచ్ ఎంట్రీగా కొండాపురం అండర్‌గ్రౌండ్‌ను ప్రారంభిస్తే, టీబీజీకేఎస్ మైన్‌ను ప్రైవేట్ పరం చేసిందన్నారు. శుక్రవారం పీవీకాలనీ కమ్యూనిటీ హాల్‌లో జరిగే జనరల్ బాడీ సమావేశానికి కార్మికులు హాజరవ్వాలని పిలుపునిచ్చారు.. నక్షత్రం గుర్తుపై ఓటు వేసి కార్మికులు ఏఐటీయూసీని గెలిపించాలని కోరారు. సమావేశంలో నాయకులు మల్లెల రామనర్సయ్య, వుల నాగరాజు, ఆదర్ల సురేందర్, సుభానీ, దాట్ల సందీప్, అంథోని రవి, కోడి రెక్కల శ్రీనివాస్, బండారి రవికుమార్, సతీష్, ఎగ్జిక్యూటీవ్ మెంబర్స్, కౌన్సిల్ మెంబర్స్, డెలిగేట్స్ పాల్గొన్నారు.